# ప్రగతి పథంలో భువనగిరి

## ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి జోరు

- రూ. 5వేల కోట్లకు పైగా నిధులతో ఎన్నో పనులు
- కొత్త జిల్లా ఏర్పాటుతో మారిన రూపురేఖలు
- అద్భుతంగా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం
- అద్దంలా మెరుస్తున్న పల్లె, పట్నం రోడ్లు
- భువనగిరి, పోచంపల్లిలో ప్రధాన రహదారుల విస్తరణ
- మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతో నీటి కష్టాలకు చెక్




జిల్లా కేంద్ర గ్రంథాలయం

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండలో మూడు జిల్లాలుగా విభజించడంతో యాదాద్రి భువనగిరి జిల్లా ఆవిర్భవించింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాకో కొత్త సమీకృత కలెక్టరేట్ భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు రాయగిరి వద్ద 12 ఎకరాల విస్తీర్ణంలో 53.20 కోట్లతో కలెక్టరేట్‌ను నిర్మించారు. కలెక్టరేట్‌తోపాటు 30శాఖల కార్యాలయాలు, మంత్రి కోసం ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేశారు. రూ.1.50 లక్షల చదరపు అడుగు విస్తీర్ణంతో జీ+2 అంతస్తుల్లో ఈ భవనాన్ని నిర్మించారు. 200 మంది కెపాసిటీతో సమావేశ మందిరం, కాన్ఫరెన్స్ హాల్ కట్టారు. పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.



భువనగిరిలోని వెజ్-నాన్ వెజ్ మార్కెట్ భవనం

### ఇంటిగ్రేటెడ్ మార్కెట్.. మోడల్ రైతు బజార్..

పట్టణంలో ఒకే చోట కూరగాయాలు, ఆకుకూరలు, చేపలు, మటన్, చికెన్, నిత్యవసర సరుకులు దొరికేలా సమీకృత మార్కెట్‌ను రూ. 8.80 కోట్లతో పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇక భువనగిరి పట్టణంలో మోడల్ రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. రూ.1.60 కోట్లతో రైతుబజార్‌లో ఉన్న 60 స్టాల్స్‌ను 120కి పెంచారు. దీంతో రైతులు, వ్యాపారస్తులకు మరింత ఉపాధి లభించింది.

### మిషన్ భగీరథతో నీటి కష్టాలకు చెక్..


ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో కృష్ణాజలాలను అందిస్తూ నీటి కష్టాలను తొలగించారు. ఒక్క భువనగిరి మండలంలోనే 34 గ్రామాలకు రూ.12కోట్లతో 32 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. రూ. 11,982 ఇండ్లకు 102.88కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. భువనగిరి పట్టణంలో మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం మొత్తం రూ.22.16కోట్లు ఖర్చు చేశారు.

### ప్రగతి పరుగులు

పట్టణంలో మున్సిపల్ బిల్డింగ్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, లేయింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కులతోపాటు మరెన్నో పనులు అభివృద్ధి చేశారు. 10 శాతం గ్రీన్ బడ్జెట్, వెన్, నాజ్ వెజ్ మార్కెట్ల నిర్మాణం, వైకుంఠధామాల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, పబ్లిక్ టాయిలెట్లు, పార్కులు నిర్మించారు. భువనగిరి, పోచంపల్లి ప్రధాన రహదారులు విస్తరించారు. ప్రధాన రహదారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రోడ్లన్నీ హరితశోభ సంతరించుకున్నాయి.

### ఇండోర్ స్టేడియం..

జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న స్టేడియాన్ని సరికొత్త హంగులతో అద్భుతంగా తీర్చిదిద్దారు. రూ. 13 లక్షల పట్టణ ప్రగతి నిధులు, రూ. 2.30 లక్షలు జనరల్ ఫండ్స్ వెచ్చించారు. పూర్తిగా లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గతంలో చెక్క కోర్టు ఉండగా, ఇప్పుడు సింథటిక్ కోర్టును ఏర్పాటు చేశారు. రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు, రెండు క్యారమ్‌బోర్డులు, రెండు చెస్ అందుబాటులో ఉంచారు. పెయింగ్‌తో స్టేడియం ఎంతో సుందరంగా కనిపిస్తున్నది. బయట ఒలింపిక్ మెడల్ గ్రహీత నిఖత్ జరీన్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.



భువనగిరి ఏరియా ఆసుపత్రిలోని న్యూబార్న్‌కేర్ యూనిట్

### పోచంపల్లి ప్రధాన రోడ్డు విస్తరణ..

పోచంపల్లి పట్టణంలో నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించారు. రూ. 6.35 కోట్లతో పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం వరకు రూ.1.60 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్డును తీర్చిదిద్దారు. నాలుగు లైన్లుగా విస్తరించి మధ్య ఐదు ఫీట్ల వెడల్పుతో డివైడర్, దానికి ఇరువైపులా 50 ఫీట్లు చొప్పున నిర్మించి డివైడర్ మధ్యన 63 బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం వరకు పూల మొక్కలు నాటారు. అభివృద్ధి పనులు పూర్తికావడంతో పోచంపల్లి పట్టణం సుందరంగా రూపుదిద్దుకుంది.

### విరివిగా వంతెనల నిర్మాణం..

ఉమ్మడి రాష్ట్రంలో బ్రిడ్జిలు లేకపోవడంతో మోస్తరు వానలకే ఉన్న మట్టి రోడ్లు కూడా దుర్భరంగా మారిపోయేవి. గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. కానీ స్వరాష్ట్రంలో ప్రత్యేక విజన్‌తో జిల్లాలో ఇప్పటి వరకు 10 పెద్ద వంతెలు పూర్తయ్యాయి. ఇందుకోసం సర్కారు రూ. 49 కోట్లను ఖర్చు చేసింది.

### చెరువులకు పూర్వవైభవం

మిషన్ కాకతీయ పథకంతో చెరువులకు పూర్వ వైభవం వచ్చింది. జిల్లాలో మిషన్ కాకతీయలో భాగంగా మొత్తం 733 చెరువుల్లో పూడికతీత తీశారు. మొదటి విడుతలో 62.4 కోట్లతో 163 చెరువులు, రెండో విడుతలో 76 కోట్లతో 203 చెరువులు, మూడో విడుతలో 70.78 కోట్లతో 240 చెరువులు, నాలుగు విడుత రూ. 25.96 కోట్లతో 127 చెరువుల్లో పూడికతీశారు. దీంతో ఎండకాలంలో సైతం చెరువులు నిండకుండాలా ఉంటున్నాయి.

### నవజాత శిశు సంరక్షణ కేంద్రం..

ఏరియా ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో 24గంటలు కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తున్నారు. యూనిట్‌లో పసిరికలు, ఫొటోథెరపీ, శ్వాస సమస్యలకు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. నెలలో 80మందికి పైగా చిన్నారులకు చికిత్స అందించి నయం చేస్తున్నారు. ఫలితంగా పేదలపై రూ. లక్షల్లో ఆర్థిక భారం తగ్గుతుంది. మరోవైపు యూనిట్ ఏర్పాటుతో నవజాత శిశు మరణాల రేటు సైతం తగ్గుముఖం పట్టింది.

### రాయగిరి మెట్లబావికి కొత్త సొబగులు..

ఏండ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన రాయగిరి మెట్ల బావి (కోనేరు) పూర్వవైభవం సంతరించుకుంది. మెట్ల బావి సుందరీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చెత్త, చెదారం, కంపచెట్లు తొలగించారు. సిమెంట్, సున్నం వేశారు. సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఆహ్లాదకరంగా ఉండేలా పార్కు, జిగేల్ మనేలా లైటింగ్ సిస్టం, ఫెన్సింగ్ పనులు చేపట్టారు. యాదగిరిగుట్టకు వెళ్తున్న భక్తులు ఈ కోనేరును సందర్శిస్తున్నారు.

### ఇంకెన్నో..

నియోజకవర్గం పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆధునిక హంగులతో జిల్లా గ్రంథాలయం భవనాన్ని నిర్మించారు. నిరాశ్రయుల భవనం అందుబాటులోకి వచ్చింది. అన్ని హంగులతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కట్టారు. సఖి కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రైతు వేదికలు, సబ్ సెంటర్లు, జీపీలకు భవనాలు నిర్మిస్తున్నారు. పోచంపల్లి మండలం జలాల్‌పూర్ పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. 444 డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించారు. మూసీ నదిపై బీబీనగర్ వద్ద బ్రిడ్జిని నిర్మించారు. బస్తీ దవాఖానలు అందుబాటులోకి తెచ్చారు. మన ఊరు -మన బడితో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. భువనగిరి పట్టణంలో అర్బన్ కాలనీలో 30 ఏండ్ల నాటి కల అయిన అండర్ పాస్ నిర్మాణం పూర్తి కావచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తంగా 125 వైకుంఠధామాలు నిర్మించారు. భువనగిరి పట్టణంలోని రాయగిరి, హుస్నేనాబాద్‌లో రూ.2 కోట్లతో ఆధునాతన వైకుంఠధామాలు, పట్టణ పరిధిలోని సింగన్నగూడెం సమీపంలో రూ. 1.60కోట్లతో స్మృతివనం నిర్మించారు. ఇటీవల కుల సంఘాలు, కమ్యూనిటీ హాళ్లు, గుడులు, ఇతర భవనాలకు పెద్ద ఎత్తున శంకుస్థాపన చేశారు.

### అద్దంలా రోడ్లు..

నియోజకవర్గంలో రోడ్లన్నీ అద్దంలా మెరుస్తున్నాయి. భువనగిరి పట్టణంతో పాటు పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, భువనగిరి మండలాల్లో రోడ్డను వేశారు. గతంకులుగా ఉన్న రోడ్డను సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్ల దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో పెద్ద ఎత్తున నిధులు విడుదలయ్యాయి. ఇక గల్లీగల్లీకి సీసీ రోడ్లు నిర్మించారు భువనగిరి పట్టణంలోని సమ్మద్ చౌరాస్తా, కిసాన్‌నగర్ రోడ్డను చూస్తే ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారు.

### కళాశాల గ్రౌండ్..

పట్టణంలోని జూనియర్ కళాశాలలో మైదానం గతంలో అధ్వానంగా ఉండేది. ఎమ్మెల్యే చొరవ పరిస్థితి మారిపోయింది. క్రీడా మైదానం అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న ది. అన్ని రకాల ఆటలు ఆడేలా గ్రౌండ్‌ను నిర్మిస్తున్నారు. అలాగే గ్రౌండ్ ముందు కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేలా ప్రణాళిక చేస్తున్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో మైదానం నిర్వహణ కోసం ఖర్చు చేయనున్నారు. ఇటీవల మైదానం వెనుకాల మరో స్థలంలో ఫుట్‌బాల్ గ్రౌండ్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు.

### మినీ ట్యాంక్ బండ్..

భువనగిరి పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు రూ.4 కోట్లతో భువనగిరి పెద్దచెరువు మినీ ట్యాంకు బండ్‌గా ఏర్పాటు చేశారు. చెరువు కట్టను వెడల్పు చేసి రహదారి వెంట అందమైన చెట్లు, కూర్చోవడానికి వీలుగా బెంచీలు ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీతో అందంగా రూపుదిద్దారు. ఇక్కడే రూ.18లక్షలతో 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. రూ.10 లక్షలతో లవ్ భువనగిరి సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. దాంతో పట్టణవాసులు ఖాళీ సమయాల్లో ఆహ్లాదంగా గడుపుతున్నారు. అంతే కాకుండా ఇటీవల రూ. 11కోట్లతో హెచ్‌ఎండీఏ నిధులతో బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నారు.

### రోగులకు వరం డయాలసిస్ సెంటర్..

భువనగిరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో రోగులకు అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది.ఇక్కడ ఐదు యంత్రాలతో నిత్యం 20 మందికి సేవలు అందిస్తున్నారు. ప్రత్యేక వార్డులో ఐదు యంత్రాలతో రోజుకు 20మంది వరకు ఉచితంగా సేవలు అందిస్తున్నారు.

### ఏరియా ఆస్పత్రిలో ఫ్రీ ఫిజియోథెరపీ..

జిల్లా కేంద్రాస్పత్రిలో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని వయసుల వారు రోజుకు 20మందికి చికిత్సను పొందుతున్నారు. అన్ని రకాల మిషన్లు, ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే మానసిక రోగులకు కూడా సైక్రియాట్రిక్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. కాగా పట్టణంలోని తారకరామానగర్, రెడ్డివాడ, సంజీవనగర్‌లో రూ.33 లక్షలతో అధునాతన బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారు.

### తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్..

జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో 134 రోగనిర్ధారక పరీక్షలు చేస్తారు. దీనిని అన్ని పీహెచ్‌సీలకు అనుసంధానం చేశారు. దీని ద్వారా నిత్యం వందల మంది ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.